క్లుప్తంగా

షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్‌కు అభినందనలు



వాసును అభినందిస్తున్న సర్పంచ్ దల్లి కాంత,గ్రామ పెద్దలు

భోగాపురం: మండలంలోని దల్లిపేట పంచాయతీ గాలిపేట గ్రామానికి చెందిన షార్ట్‌ఫిల్మ్ డైరెక్టర్ గాలి వాసును సర్పంచ్ దల్లి కాంత, తదితరులు శుక్రవారం అభినందించారు. వాసు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను సర్పంచ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దల్లి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజాలకు సంక్రాంతి శుభాకాంక్షలు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ప్రజలంతా భోగి, సంక్రాంతి, కనుమ పండుగను సంతోషంగా జరుపుకోవాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

శుభాకాంక్షలు..

భోగాపురం: ఏపీ ఎన్జీఓ భోగాపురం తాలుకా సంఘ కార్యవర్గ సభ్యులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భోగి పండగకు దూరం..



అలుగోలు గ్రామం

నెల్లిమర్ల రూరల్: సంక్రాంతి సంబరాల్లో ప్రధానమైన భోగి పండగకు మండలంలోని అలుగోలు గ్రామం సుమారు 50 సంవత్సరాలుగా దూరంగా ఉంటోంది. ఆ ఊరిలో భోగి మంట వేస్తే అరిష్టం జరుగుతుందనే నమ్మకంతో పండగకు ప్రజలందరూ దూరంగా ఉంటూ వస్తున్నారు. 50 ఏళ్ల కిందట గ్రామంలో భోగి మంట వేయగా.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంటల్లో పడి చనిపోవడంతో అప్పటి నుంచి భోగిమంట వేయడం లేదని గ్రామపెద్ద సారిక వైకుంఠం తెలిపారు. ఆ రోజు యువతకు క్విజ్, ముగ్గులు, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని గ్రామస్తులు చెప్పారు.

మహాసభలను విజయవంతం చేయండి

విజయనగరం పూల్‌బాగ్: ఈ నెల 18 నుంచి 22 వరకు బెంగళూరులో జరగనున్న సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్‌పీఆర్ శ్రామిక భవనంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టీవీ రమణ, ఎ. జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడ్ని తల్లికి అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సై లోవరాజు

విజయనగరం క్రైమ్: ట్రాఫిక్ ఎస్సై చొరవతో ఓ బాలుడు తన తల్లి చెంతకు చేరుకున్నాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో మూడులాంతర్ల జంక్షన్ శుక్రవారం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై వి. లోవరాజుకు ఏడుస్తూ ఓ బాలుడు తారసపడ్డాడు. వెంటనే ఆ చిన్నారిని నీడన కూర్చోబెట్టి సపర్యలు చేశారు. వివరాలు అడిగినప్పటికీ చెప్పలేకపోవడంతో ఎస్సై చిన్నారి కుటుంబ సభ్యుల కోసం గాలించగా... సుమారు గంట తర్వాత గుంకలాం ప్రాంతానికి చెందిన గౌరి తన బిడ్డ కనిపించడం లేదంటూ రోధిస్తూ కనిపించింది. వెంటనే ఎస్సై చిన్నారిని అప్పగించడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

ప్రారంభమైన సీబీసీఎన్‌సీ మహాసభలు

విజయనగరం టౌన్: నగరంలోని సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో 68వ కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్ట్ చర్చ్‌స్ ఆఫ్ నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సంఘమిత్ర ఆర్ఎస్ జాన్ ఆధ్వర్యంలో చర్చి అధ్యక్షుడు ఆనందరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీబీసీఎన్‌సీ ప్రతినిధులు కె.సుకుమార్, టి.శామ్యూల్ రాజు, రెవరెండ్ జాన్ డేవిడ్, ఎం.ఎ నాయుడు, డేని, కృపానంద్, తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట పుష్కలంగా తాగునీరు

- చురుగ్గా తాగునీటి బోర్లకు మరమ్మతులు
- ఇప్పటికే అందుబాటులోకి 13 బోర్లు
- రూ. 3 లక్షలతో మెటీరియల్ కొనుగోలు



జరజాపుపేటలో బాగైన తాగునీటి బోరు

నెల్లిమర్ల:

పండగ వేళ పట్టణంలో పుష్కలంగా తాగునీటిని అందించడానికి నగర పంచాయతీ కౌన్సిల్‌తో పాటు అధికారులు చర్యలు ప్రారంభించారు. కొంత కాలంగా పాడైన బోర్లకు మరమ్మతులు చేపడుతున్నారు. మరమ్మతుల నిమిత్తం అవసరమైన మెటీరియల్‌ను రూ. 3 లక్షలతో తాజాగా కొనుగోలు చేశారు. మొదటి విడతగా ఒక్కో వార్డులో రెండేసి చొప్పున మొత్తం 40 బోర్లకు మరమ్మతులు చేపట్టాలని తీర్మానించగా, ఇప్పటికే 13 బోర్లను బాగుచేశారు. దీంతో సంక్రాంతి పండగ వేళ పట్టణవాసులకు పుష్కలంగా తాగునీరు అందనుంది.

నగర పంచాయతీలోని 20 వార్డులకు ఇప్పటికే కుళాయిల ద్వారా తాగునీరు పూర్తిస్థాయిలో అందుతోంది. కొండ ప్రాంతం కావడంతో కొన్ని ప్రాంతాల్లోని హ్యాండ్ బోర్ల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అటువంటి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని ఇటీవల నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. మొదటి విడతగా ప్రతి వార్డులోనూ రెండేసి చొప్పున బాగుచేయాలని నిర్ణయించారు. దీని కోసం రూ. 3 లక్షలతో అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేయగా, పది రోజులుగా మరమ్మతులు చేపడుతున్నారు. అత్యవసరమైన ప్రాంతాల్లో స్థానిక కౌన్సిలర్ల సహకారంతో ఇప్పటికే 13 బోర్లను బాగుచేశారు. మిగిలిన బోర్లకు కూడా త్వరలోనే మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో సంక్రాంతి పండగ వేళ పట్టణానికి తాగునీరు పుష్కలంగా అందనుంది. ముఖ్యంగా రానున్న వేసవిలో పట్టణవాసులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా బోర్లు ఉపయోగపడతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ మాట్లాడుతూ, పట్టణ పరిధిలో పాడైన తాగునీటి హ్యాండ్ బోర్లను బాగుచేయడానికి చర్యలు చేపట్టామన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబరు శ్రీరాములనాయుడు

నెల్లిమర్ల: గ్రామాల్లోని రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబరు అంబళ్ల శ్రీరాములనాయుడు వ్యవసాయ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదనే ఫిర్యాదులు రాకూడదన్నారు. రబీకి సంబంధించి ఈ క్రాప్‌లో పంటలను నమోదు చేయించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన పశువుల బీమా పథకాన్ని మండల పశుసంవర్థక అధికారి చంద్రశేఖర్ వివరించారు. బీమా మొత్తంలో 20 శాతం మాత్రమే రైతు చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా అమలు చేస్తున్న ఆడ పెయ్యల పిండోత్పత్తి పథకం గురించి రైతులకు వివరించాలని సభ్యులకు సూచించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ జి. గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఏఓ ఎం. పూర్ణిమ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ముగ్గుల పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న నటి జ్యోతిరాయ్

విజయనగరం టౌన్: సనాతన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణలో వాజీ చానల్ ఎల్లప్పుడూ ముందుంటుందని ప్రముఖ సినీ, టీవీ నటి జ్యోతిరాయ్ అన్నారు. ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన రంగోలీ, హౌసీ పోటీల విజేతలు అనిత, కల్యాణి, సింధూజలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతిరాయ్ మాట్లాడుతూ, కళలకు కాణాచి అయిన విజయనగరం రావడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. వాజీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. చానల్ డైరెక్టర్ జి.ఈశ్వర్‌కౌశిక్ మాట్లాడుతూ, నాణ్యమైన ప్రసారాలను అందించడమే కాకుండా, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వాజీ చానల్ నిలిచిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులకు వైఎస్సార్ పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న అంబళ్ల, తదితరులు

నెల్లిమర్ల రూరల్: గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల లోపు పిల్లల తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు సూచించారు. మండలంలోని ఒమ్మి గ్రామ సచివాలయంలో గర్భిణులకు వైఎస్సార్ పౌష్టికాహార కిట్లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్థకమైన ఆహారాన్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నాయన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది కేంద్ర పరిధిలో ఉన్న లబ్ధిదారులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దురగాశి ఎర్రంనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా చేస్తాం



వంగపల్లిపేటలో తాగునీటి సరఫరా పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేట గ్రామంలో శుక్రవారం ఇంటింటి కుళాయిల ద్వారా జరుగుతున్న తాగునీటి సరఫరాను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోవిందరావు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగి తాగునీరు సరఫరా జరుతుతున్న తీరును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామస్తులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన మజ్జి శ్రీనివాసరావులకు సమస్య వివరించడంతో వారి ఆదేశాల మేరకు గ్రామంలో తాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. అయితే ఇప్పటికే గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అయినప్పటికీ ఒక్కోసారి కొన్ని నివాసాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు వివరించినట్లు చెప్పారు. అందుకనే గ్రామంలో అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారితో పాటు ఎంపీటీసీ గిరడ రాందాసు, పతివాడ రాజారావు, మీసాల సీతారాం తదితరులు ఉన్నారు.

చోరీలపై అప్రమత్తం

కొత్తవలస: పండగ వేల చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస సీఐ ఎస్.బాల సూర్యారావు సూచించారు. శుక్రవారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించి చోరీలపై ప్రజలను అప్రమత్తం చేశారు. సంక్రాంతి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు బంగారం, నగదు, విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. చిన్నపిల్లల ఒంటిపై విలువైన ఆభరణాలు వేసి ఒంటరిగా బయటకు పంపించొదన్నారు. ఇల్లు విడిచి పెట్టి దూర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కొత్తవారికి ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారి ఆధార్‌కార్డు, ఇతర వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో పాసింజర్ వాహనాల్లో ప్రయాణించేవారు మిత్రులకు, కుటుంబ సభ్యులకు ముందుగా సమాచారం అందించి వెళ్లడం మంచిదన్నారు. మోటార్ సైకిళ్లకు హేండల్ లాక్ వేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సీఐ నంబర్ 91211 09421, పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



భోగాపురం: భోగిమంట వద్ద రెవెన్యూ సిబ్బంది

భోగాపురం: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి విధులకు హాజరయ్యారు. సంబరాల్లో భాగంగా భోగి మంట వేసి, సంక్రాంతి సంబరాలు జరుపుకున్రాను. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు శ్రీమన్నారాయణ ఆశీస్సులు

విజయనగరం ఫోర్ట్: చిన్నారుల తలపై భోగి పండ్లు వేస్తే శ్రీమన్నారాయణ ఆశీస్సులు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. పట్టణంలోని హుకుంపేట అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద రంగురంగుల ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భగవంతుడి ఆశీస్సులు పొందడానికే చిన్నారులకు భోగి పండ్లు పోస్తారని చెప్పారు.



విజయనగరం ఫోర్ట్: పిల్లలతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న అనురాధ

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఇందిర క్రాంతి పథం(వెలుగు) సిబ్బందితో బుధవారం ఆయన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో పాటు అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే వెలుగు ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర రుణాలు చక్కగా అందిస్తున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం నుంచి వస్తున్న రుణాలు మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బాగుపడే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం ఎంవీ రాజశేఖర్, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి వెలకట్టలేనిదని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్ మాధవరావు అధ్యక్షతన శుక్రవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతును అన్ని విధాలా ప్రోత్సహించేందుకు వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రైతులు రుణపడి ఉంటారన్నారు. సలహా సంఘం చైర్మన్ మాధవరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందుతోందన్నారు. మండల వ్యవసాయాధికారి స్వాతికుమారి మాట్లాడుతూ ప్రస్తుతం సాగునీరు అందుబాటులో ఉన్నందున రైతులు రబీ వరి సాగుకు సిద్ధం కావాలని సూచించారు. రైతుల అవసరాలకు తగ్గట్లు ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రూపేష్, రైతులు గేదెల నర్సింనాయుడు, పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై వీరజనార్దన్

కొత్తవలస: యువకులు స్నేహపూర్వకంగా మెలిగేందుకు క్రీడలు దోహద పడతాయని, తద్వారా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఎస్ఐ వీరజనార్దన్ అన్నారు. మండలం కేంద్రంలోని విశాఖపట్నం రోడ్డులో ఉన్న వసంత్ విహార్ కాలనీ వద్ద వసంత్ విహార్ యూత్, ఫర్ ది పీపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు మండలం నలుమూలల నుంచి 20 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలు నాకౌట్ పద్ధతిలో సాగాయి. శనివారం ఫైనల్ మ్యాచ్, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. వసంత్ విహార్ చైర్మన్ వల్లూరి జయప్రకాష్, ఫర్ ది పీపుల్ ట్రస్ట్ చైర్మన్ వి.హరకుమార్, కర్రి సూర్య నూకరాజు, రావులపూడి గోవింద ఆర్థిక సాయంతో మొదటి మూడు బహుమతులు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు నగదు, క్రీడాకారులకు టీషర్టులు, బాల్స్, నెట్‌లను సమకూర్చారు. కార్యక్రమంలో వసంత్ విహార్ యూత్ సభ్యులతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు

దత్తిరాజేరు: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని పెదమానాపురం ఎస్సై బి.భాగ్యం హెచ్చరించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులందరితో కలిసి పండగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. మద్యం తాగి రోడ్లపై తిరిగినా, బైక్‌లు వేగంగా నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. పండగ సమయంలో చట్ట విరుద్ధమైన పనులు జరగకుండా నిత్యం మొబైల్ వాహనం ద్వారా సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు.

బీమా పరిహారం అందజేత



లబ్ధిదారుకు బీమా పరిహారం అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ మల్లేశ్వరరావు

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామానికి చెందిన లండ నారాయణమ్మ జగనన్న చేయూత పథకం కింద కొనుగోలు చేసిన పాడిఆవు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో అధికారులు బీమా పరిహారాన్ని అందజేశారు. ఈ నెల 5న ఆవు మృతి చెందడంతో పరిహారం కోసం బాధితురాలు సంబంధిత అధికారులను సంప్రదించాడు. బీమా వర్తించడంతో గొట్లాంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్ పి.మల్లేశ్వరరావు శుక్రవారం రూ.74వేలును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. బ్రాంచ్ పరిధిలో ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు డ్వాక్రా సంఘాలకు రెండున్నర కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, బ్యాంకు అధికారులు విజయలక్ష్మి, శ్రీనివాస్, నీలిమ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బొద్దాంలో ఇంటింటి కుళాయిలు ప్రారంభం

వేపాడ:

మండలంలో బొద్దాం గ్రామంలో ఇంటింటి కుళాయిలను ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో మూడు వీధుల్లో 50 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, వైస్ సర్పంచ్ స్వర్ణపూడి వెంకటరమణ, ఎంపీడీఓ పట్నాయక్, గ్రామ పెద్దలు ఎర్రా సన్యాసిరావు, దుల్ల కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బొద్దాంలో ఇంటింటి కుళాయిలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు